సాక్షి విశాఖపట్నం

బుధవారం : 4 : జనవరి : 2023



కరుణించమ్మా గంగమ్మా

- ఘనంగా గంగమ్మ తల్లి జాతర
- కలశాల్లో పవిత్ర జలాలతో ఊరేగింపు

10లో



డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజ నిర్వహించారు. ఉదయం నిర్వహించిన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జోనల్ కమిషనర్ల బదిలీ

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ పరిధిలో గల పలువురు జోనల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జోన్-1(భీమిలి) జోనల్ కమిషనర్ ఎస్.వి.రమణను జోన్-7(అనకాపల్లి జోన్)కు, జోన్-2(మధురవాడ) జోనల్ కమిషనర్ కె.రాముని జోన్-1(భీమిలి)కు, జోన్-7 జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మిని జోన్-2కు, జోన్-4(సూర్యాబాగ్) జోనల్ కమిషనర్ కె.చక్రవర్తిని డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా, డీపీవోగా విధులు నిర్వహిస్తున్న శివప్రసాద్‌ను జోన్-4 జోనల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జోన్-3(ఆశీల్‌మెట్ట) జోనల్ కమిషనర్‌గా విజయలక్ష్మి, జోన్-5(జ్ఞానాపురం) జోనల్ కమిషనర్‌గా ఆర్‌జీవీ కృష్ణ, జోన్-6(గాజువాక) జోనల్ కమిషనర్‌గా పి.సింహాచలం అదే స్థానంలో కొనసాగనున్నారు.

జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జగదీశ్వరరావు



విశాఖలీగల్: విశాఖ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది కాండ్రేగుల జగదీశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పరిపాలన, న్యాయ వ్యవహారాల శాఖ కార్యదర్శి హరీష్ కుమార్‌గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ఈ పదవిలో మూడేళ్లు కొనసాగుతారు. 1998లో న్యాయవాదిగా ప్రస్థానం ప్రారంభించి సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణ దగ్గర జూనియర్‌గా చేరి న్యాయశాస్త్రంలో మెళకువలు నేర్చుకున్నారు. విశాఖ న్యాయవాదుల సంఘానికి 2007లో కోశాధికారిగా, 2017లో కార్యదర్శిగా పనిచేశారు. జగదీశ్వరరావును జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్, కార్యదర్శి వై.వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు జి.ఎం.రెడ్డి, ఎస్.కాళిదాసు రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సీనియర్ సభ్యుడు ఎస్.కృష్ణమోహన్ అభినందించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు

ఎమ్మెల్సీ మాధవ్

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తన తండ్రి పి.వి.చలపతిరావు అంతిమయాత్రకు తరలివచ్చి, తనకు ధైర్యం చెప్పిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, పలు సంస్థల ప్రతినిధులకు ఎమ్మెల్సీ మాధవ్ ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి సేవలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అంత్యక్రియలు నిర్వహించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు.

ఏపీపీజీ సెట్ మిగులు సీట్ల భర్తీకి 6న కౌన్సెలింగ్

ఏయూక్యాంపస్ : ఏపీ పీజీసెట్ 2022లో ప్రవేశాల అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 6న ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. ఉన్నత విద్యా మండలి ఇచ్చిన నియమావళిని అనుసరిస్తూ మిగులు సీట్లు స్పాట్ అడ్మిషన్ల విధానంలో భర్తీ చేస్తామన్నారు. పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో ఆ రోజు 10 గంటలకు ప్రవేశాలు జరుపుతామన్నారు. పూర్తి సమాచారం కోసం 0891-2573441 నంబరులో సంప్రదించాలని సూచించారు. కోర్సుల వారీగా ఖాళీ వివరాలు www.audoa.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

6 నుంచి ఆర్గానిక్ మేళా



మేళా వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలస్ వేదికగా గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల మేళా(ఆర్గానిక్ మేళా) నిర్వహిస్తున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి తెలిపారు. మేళా వివరాలతో కూడిన ఫ్లెక్సీని మంగళవారం గాదిరాజు ప్యాలస్ ఆవరణలో విడుదల చేశారు. సంఘం అధ్యక్షుడు పీఎల్ఎన్ రాజు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే మేళాలో ప్రకృతి ఆధారిత పంటలు, ఉత్పత్తులు, ఔషధ మొక్కలు, విత్తనాలు విక్రయిస్తున్నట్లు చెప్పారు. గో, ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులు వారి ఉత్పత్తులను మేళాలో ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, విశాఖ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీస్ చైర్మన్ పేర్ని రామకృష్ణ పాల్గొన్నారు.

కార్గో కొత్త పుంతలు!

- ప్రైవేటు లాజిస్టిక్స్‌తోనూ ఒప్పందాలు
- సరకు రవాణాలో ఆర్టీసీ జోన్-1 జోరు
- గత ఏడాది కంటే రూ.4.15 కోట్లు పెరిగిన ఆదాయం
- అన్ని ఆదాయ మార్గాలపైనా ఆర్టీసీ అధికారుల దృష్టి
- ఏటీబీ ఏజెంట్ల వ్యవస్థ మరింత విస్తృతం



ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్సిల్ రవాణా కేంద్రం



ఆర్టీసీ సరకు రవాణా కంటెయినర్

సాక్షి, విశాఖపట్నం: కార్గో రవాణాలో ఆర్టీసీ ఊహించిన దానికంటే ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఇప్పటికే తక్కువ సమయంలో సరకులను, పార్సిళ్లను గమ్యానికి చేరుస్తూ వినియోగదారుల ఆదరణ చూరగొంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ సేవలను మరింతగా విస్తృతం చేసే దిశగా ఆలోచన చేస్తోంది. సరకు రవాణాలో ఆర్టీసీ జోన్-1 (పూర్వ విజయనగరం జోన్) జోరు మీద ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న ఈ జోన్‌లో 47 సరకు రవాణా వాహనాలున్నాయి. వీటిలో 17 కంటెయినర్లు, 30 డీజీటీలు (డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు) ఉన్నాయి. ప్రస్తుతం ఇవన్నీ ఒక్క రోజు కూడా ఖాళీ లేకుండా తిరుగుతున్నాయి. ఇలా రోజు రోజుకు పెరుగుతున్న కార్గో రవాణాతో వీటి సంఖ్యను పెంచాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు. మరోవైపు కొత్తగా ప్రైవేటు లాజిస్టిక్స్ (పార్సిల్) సంస్థలతోనూ ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా వీరు అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం ఆయా సంస్థలకు అధీకృత ఏజెన్సీలను ఇస్తారు. ఆపై ఆ సంస్థలు బుక్ చేసిన సరకులను గాని, లేదా ఆ సంస్థలు రవాణా చేయగా మిగిలిన సరకులను గాని ఆర్టీసీ ద్వారా కూడా రవాణా చేసేలా చర్చిస్తున్నారు. బుకింగ్ చేసే వారి నుంచి ప్రైవేటు పార్సిల్ సంస్థలు వసూలు చేసే చార్జీతో ఆర్టీసీకి సంబంధం ఉండదు. ఆర్టీసీ నిర్దేశిత రవాణా చార్జీ చెల్లిస్తే చాలు గమ్యానికి చేరవేస్తారు. ప్రైవేటు పార్సిల్ సర్వీసులు సరకును గమ్యానికి చేర్చడానికి 3-4 రోజుల సమయం పడుతుంటే ఆర్టీసీ గరిష్టంగా 24-48 గంటల్లోపే ఆయా ప్రాంతాలకు చేరుస్తుంది. ఇలా ప్రైవేటు పార్సిల్ సంస్థల కంటే వేగంగా గమ్యాన్ని చేరుస్తుండడం తమకు కలిసొచ్చే అంశంగా ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

కొరియర్ సేవల్లో దూకుడు

ఆర్టీసీ కొరియర్ సేవలకు మరింత ఆదరణ లభిస్తోంది. పార్సిల్ కౌంటర్ నుంచి 10 కి.మీల పరిధిలో 50 కిలోల బరువు వరకు సరకు/కొరియర్ పార్సిళ్లను వినియోగదారుడు కోరుకున్న చిరునామాకు డోర్ డెలివరీ చేస్తున్నారు. వీటిలో వివిధ రకాల పార్సిళ్లతో పాటు బ్లడ్ శాంపిల్స్ డెంటల్ కిట్స్ వంటివి కూడా ఉంటున్నాయి. జోన్-1 నుంచి సిమెంట్, వైట్ సిమెంట్, హార్డ్‌వేర్, గృహావసర సరకులు, గోధుమ పిండి, దుస్తులు, ఫ్లిప్‌కార్ట్ సరకులు, బిస్కెట్లు, విత్తనాలు, పుస్తకాలు, మందులు, బియ్యం, నూకలు, పాత టైర్లు వంటివి బుక్ అవుతున్నాయి. ఇంకా ఇల్లు మారాలనుకునే వారి సామగ్రి తరలింపును కూడా ఆర్టీసీ చేపట్టింది. ఇలా సరకు రవాణా ద్వారా 35 శాతం, పార్సిళ్ల ద్వారా 65 శాతం ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

ఏటీబీ ఏజెంట్ల సంఖ్య పెంపు

మరోవైపు ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణతో ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్ ఏజెంట్ల (ఏటీబీలు) వ్యవస్థను విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఈ జోన్‌లో 60 మందికి పైగా ఏటీబీ ఏజెంట్లు ఉండగా ఆ సంఖ్యను 200 వరకు పెంచనున్నారు. ఈ ఏజెంట్లకు బుకింగ్ చార్జీలో 15 శాతం కమీషన్‌గా చెల్లిస్తారు. ఏటీబీ కోసం గ్రామీణ ప్రాంతంలో రూ.1000, అర్బన్‌లో రూ.5 వేల చొప్పున తిరిగి చెల్లించే పద్ధతిలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఏటీబీ ఏజెన్సీలతో పాటు ఇంటి సామగ్రి తరలింపు కోసం 7331147260/ 7331147261/ 9346749365 నంబర్లకు సంప్రదించాలని ఆర్టీసీ జోనల్ అధికారులు కోరుతున్నారు.

రూ.4.15 కోట్ల పెరుగుదల

కార్గో రవాణాలో ఆర్టీసీ జోన్-1 గత ఏడాదికంటే మెరుగైన ఆదాయాన్ని సాధించింది. 2021 ఏప్రిల్ నుంచి డిసెంబర్‌కు ఈ జోన్ రూ.11.37 కోట్లు ఆర్జించగా, 2022 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.15.52 కోట్లు సంపాదించింది. అంటే గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4.15 కోట్ల ఆదాయం పెరిగిందన్న మాట! ఇలా 36 శాతానికి పైగా వృద్ధి కనిపించింది.

కార్గో వ్యవస్థ మరింత బలోపేతం



ఆర్టీసీ కార్గో రవాణాకు మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం. ఏటీబీ ఏజెన్సీలను విస్తృతం చేస్తాం. డిమాండ్‌కు అనుగుణంగా డీజీటీలు/కంటైనర్ వాహనాలను పెంచుతాం. డీజిల్ ధరలు గణనీయంగా పెరిగినా 2018లో నిర్దేశించిన రవాణా చార్జీలే వసూలు చేస్తున్నాం. ఈ జోన్‌లో గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4.5 కోట్ల కార్గో ఆదాయం పెరిగింది. ప్రైవేటు కార్గో సంస్థలకంటే వేగంగా, సురక్షితంగా సరకులు, పార్సిళ్లను డెలివరీ ఇస్తున్నాం. త్వరలో ప్రైవేటు కార్గో సంస్థలకు ఆథరైజ్డ్ ఏజెన్సీలు ఇచ్చి వారి సరకును కూడా ఆర్టీసీ ద్వారా రవాణా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

–రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్-1

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు రవీంద్ర, కల్యాణి, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

- కలెక్టర్ మల్లికార్జున
- జిల్లాలో 1,60,114 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): పారదర్శకమైన పాలన ద్వారా లబ్ధిదారులకు పక్కాగా సంక్షేమ పథకాలు అందుతున్నట్లు కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున తెలిపారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం జరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1,60,114 మంది బలహీన వర్గాలు, వృద్ధాప్య, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా రూ.44.98 కోట్ల మేర వైఎస్సార్ పెన్షన్ కానుక అందుతున్నట్లు వివరించారు. ప్రభుత్వం ఈ నెల నుంచి రూ.250 పెంచుతూ మొత్తం 2,750 చొప్పున పింఛన్ అందజేస్తున్నట్లు వెల్లడించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ద్వారా అర్హతే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గతంలో ప్రజా ప్రతినిధుల సిఫార్సులు ఉంటే తప్ప సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. ఇప్పుడు లబ్ధిదారులు నేరుగా సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే చాలని.. అర్హత ఉంటే పథకాలు మంజూరవుతున్నాయని చెప్పారు. వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలంలో పెన్షన్ వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ మూడున్నరేళ్లలో 98 శాతం హామీలను నెరవేర్చిన గొప్ప నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రాజమండ్రిలో జరిగిన ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం రూ.44.98 కోట్ల మెగా చెక్కును ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్ మల్లికార్జున లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి అధికారి పూర్ణిమా దేవి, డీఆర్‌డీఏ పీడీ శోభా రాణి, కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంది, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

విశాఖలీగల్: వచ్చే నెల 11న జరిగే మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి పిలుపునిచ్చారు. జాతీయ న్యాయసేవా ప్రాధికార సంస్థ పిలుపు మేరకు నిర్వహించే ఈ అదాలత్‌లో సివిల్, రాజీ కాగలిగిన క్రిమినల్ కేసులు, ప్రభుత్వ, బీమా కంపెనీలు, మోటారు వాహన బీమా కేసులు, పూర్వప్రాథమిక వివాదాలు పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ ప్రభుత్వ, రెవెన్యూ, పోలీసు, జైలు అధికారులతో పలు కేసులకు సంబంధించిన అంశాలను చర్చించారు. జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ, పోలీసు రెవెన్యూ అధికారులతో మాట్లాడి మెగా లోక్ అదాలత్‌లో అధిక కేసులు రాజీ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. డీసీపీలు సునీల్ సుమిత్ గరుడ్, ఆనంద్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ సిహెచ్ రంగయ్య పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ముతో ఉడాయింపు

- 15వ వార్డు సింహాద్రిపురంకాలనీ సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ నిర్వాకం
- 264 మంది పింఛన్ సొమ్ము రూ.7.50లక్షలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య



కలెక్టర్ మల్లికార్జునకు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): ఓ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ పేదల సొమ్ముతో ఉడాయించాడు. మూడు రోజులుగా అతని జాడ లేకపోవడంతో వార్డు కార్పొరేటర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీ సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్న సత్యనారాయణ గత నెల 31న బ్యాంకు నుంచి పెన్షన్ సొమ్ము విత్‌డ్రా చేయడానికి సచివాలయం నుంచి వెళ్లారు. అతను తిరిగి సచివాలయానికి రాలేదు. ఈ నెల ఒకటో తేదీన అడ్మిన్ లీలాకుమార్ అతనికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. 2వ తేదీన కూడా అదే పరిస్థితి ఎదురైంది. 3న ఫోన్ రింగ్ అయినా.. ఎవరూ లిఫ్ట్ చేయలేదని అడ్మిన్ తెలిపారు. సచివాలయం పరిధిలో 264 మందికి పెన్షన్ సొమ్ము (రూ.7.50 లక్షలు) పంపిణీ ఆగిపోయింది. దీంతో సచివాలయ అడ్మిన్ జోన్-3 జెడ్సీ, ఏపీడీలకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయాన్ని స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య మంగళవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింహాద్రిపురంకాలనీ సచివాలయం పరిధిలో 264 మంది వరకు ఫించన్ అందకపోవడంతో ఆరా తీశామన్నారు. రెండు రోజులపాటు వేచి చూసి మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వెల్ఫేర్ సెక్రటరీపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

మహిళా విద్యాభివృద్ధికి ఆమె విశేష కృషి



సావిత్రి బాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, నాయకులు

విశాఖ విద్య: మహిళా విద్యాభివృద్ధికి సావిత్రి బాయి పూలే విశేష కృషి చేశారని, ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె జయంతి వేడుకలు జరిగాయి. ముందుగా సావిత్రి బాయి చిత్రపటానికి పార్టీ నాయకులతో కలసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. వెనుకబడిన వర్గాలు, మహిళా అభ్యుదయం కోసం ఆమె చేసిన కృషి ఎనలేనిదన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఎంతో మందికి చదువులు నేర్పి గొప్ప సంఘ సంస్కర్తగా కీర్తిగాంచారన్నారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు చొక్కాకుల లక్ష్మి, జాన్ వెస్లీ, సుజాత సత్యనారాయణ, కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్, పార్టీ నాయకులు రవిరెడ్డి, సతీష్ వర్మ, అల్లంపల్లి రాజాబాబు, కొండా రాజీవ్ గాంధీ, కె.రామన్నపాత్రుడు, సత్యాల సాగరిక, మన్యాల శ్రీనివాస్, యువశ్రీ, పైడా శ్రీను, కేవీ బాబా, ప్రకాష్, బొండా ఉమామహేష్, దేవర జగదీష్, రవికుమార్, వెంకట్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జీవితం.. నేటి సమాజానికి ఆదర్శమని ఆలిండియా బీసీ ప్రజా సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం మంగళవారం తుమ్మిడి బ్రదర్స్‌లోని ఆలిండియా బీసీ ప్రజా సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగింది. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు చదువుకోవాలని సావిత్రి బాయి ఆనాడే గుర్తించి వారి విద్యాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. ఆమె జయంతి రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ట మల్లేశ్వర, జాతీయ గౌరవ అధ్యక్షుడు తుమ్మిడి రామ్‌కుమార్, జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి నూకరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాకల రాజారావు, కృష్ణవేణి, ఊర్వశి, మహాలక్ష్మి, వెంకటలక్ష్మీ, సీఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీ హారియర్ రెడీ

- రూ.7.50 కోట్లతో యుద్ధ విమాన మ్యూజియం పనులు పూర్తి
- సాగరతీరంలో అదనపు ఆకర్షణగా నిలవనున్న మ్యూజియం
- ఈ నెలలో సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు



సీ హారియర్ మ్యూజియం



మ్యూజియంలో కొలువైన యుద్ధ విమానం

దొండపర్తి (విశాఖ దక్షిణ): సుందర సాగర తీరంతో ప్రపంచ పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తున్న విశాఖ సిగలో మరికొద్ది రోజుల్లో మరో మణిహారం చేరనుంది. నౌకాదళంలో 32 ఏళ్ల పాటు సేవలందించి నిష్క్రమించిన సీ హారియర్ యుద్ధ విమానం సందర్శకులను కనువిందు చేయనుంది. రూ.7.50 కోట్లతో చేపట్టిన ఈ యుద్ధ విమాన మ్యూజియం పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ నెలలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మ్యూజియాన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సీ హారియర్ విశిష్టత

1983లో బ్రిటిష్ ఏరోస్పేస్ నుంచి కొనుగోలు చేసిన ఈ సీ హారియర్ యుద్ధ విమానం నౌకాదళం ఏవియేషన్ విభాగంలో చేరింది. గోవాలోని ఐఎన్ఎస్ హంస యుద్ధ నౌకలో 32 ఏళ్ల పాటు దేశానికి సేవలందించింది. 2016లో సేవల నుంచి నిష్క్రమించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో వీఎంఆర్డీఏ ఈ యుద్ధ విమానాన్ని సాగరతీరంలో మ్యూజియంగా తీర్చిదిద్దుతోంది. సాగరతీరానికి అదనపు ఆభరణంలా ఇప్పుడు సీ హారియర్ యుద్ధ విమానం కూడా సిద్ధమవుతోంది.

రూ.7.5 కోట్లతో..

బీచ్‌రోడ్డు రాజీవ్ స్మృతి భవన్‌లో రూ.7.5 కోట్లతో ఈ సీ హారియర్ యుద్ధ విమాన మ్యూజియం పనులు చేపట్టింది. హైడ్రాలిక్ క్రేన్ సహాయంతో జీ ప్లస్ టూ బిల్డింగ్‌లో సీహారియర్‌ను వేలాడదీశారు. దీని విశిష్టతతో పాటు పర్యాటకులకు నిజమైన యుద్ధ విమానంలో ప్రయాణించే అనుభూతి కలిగిలే ఈ మ్యూజియాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో సిమ్యులేటర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అలాగే నావికాదళానికి, ఎయిర్‌క్రాఫ్ట్‌కు సంబంధించి విశేషాలతో కూడిన చిత్రాలను కూడా ప్రదర్శించనున్నారు. ఇప్పటి సాగరతీరంలో టీయూ-142 ఎయిర్‌క్రాఫ్ట్ సందర్శకులను ఎంతగానో అలరిస్తోంది. కురుసుర జలాంతర్గామి సందర్శకుల మనసు దోచుకుంటోంది. మరికొద్ది రోజుల్లోనే ఈ సీ హారియర్ మ్యూజియం కూడా అదనపు ఆకర్షణగా నిలవనుంది.

గోవా నుంచి ట్రైనింగ్ సిమ్యులేటర్

సీ హారియర్ మ్యూజియంలో వివిధ రకాల యుద్ధ విమానాల గురించి తెలుసుకునేలా సమగ్ర సమాచార ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. టీయూ-142 మ్యూజియం ముందు భాగంలో ఏర్పాటు చేసిన ఆర్చ్ మాదిరిగా సబ్‌మెరైన్ మ్యూజియాన్ని తీర్చిదిద్దనున్నారు. వీటికి తోడుగా.. ఇంటిగ్రేటెడ్ మ్యూజియంలో విభిన్న హంగులు కొత్త అనుభూతిని అందివ్వనున్నాయి. సీహారియర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను నడిపేందుకు ముందుగా శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణని నేరుగా ఎయిర్‌క్రాఫ్ట్‌లో కాకుండా దాని సిమ్యులేటర్ ద్వారా ఇవ్వనున్నారు. గోవాలోని ఐఎన్ఎస్ హంసా నేవల్‌బేస్‌లో ఉన్న ట్రైనింగ్ సిమ్యులేటర్‌ను విశాఖకు తీసుకొచ్చారు. అదే విధంగా కొచ్చి నేవల్ స్టేషన్‌లో ఉన్న విడిభాగాల్ని కూడా రప్పించారు. ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు



సీ హారియర్ మ్యూజియం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మ్యూజియం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. మ్యూజియాన్ని సందర్శించడంతో పాటు జ్ఞాపకాల్ని తీసుకెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ ఎ.మల్లికార్జున, కలెక్టర్, వీఎంఆర్డీఏ ఇన్‌చార్జి కమిషనర్

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): అరకు వెళ్లే రైల్వే ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31, ఫిబ్రవరి 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24 తేదీల్లో బయలుదేరే విశాఖపట్నం-కిరండూల్(08551) రైలుకు, కిరండూల్‌లో ఈ నెల 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30, ఫిబ్రవరి 1, 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25 తేదీల్లో బయలుదేరే కిరండూల్-విశాఖపట్నం(08552)రైలుకు విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జత చేస్తున్నారు.

భగత్‌కి కోటి దారి మళ్లింపు

భోపాల్ డివిజన్ బినా-గుణ సెక్షన్ పరిధిలో జరుగుతున్న డబ్లింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే భగత్‌కి కోటి వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 5, 12, 19 తేదీల్లో బయలుదేరే విశాఖపట్నం- భగత్ కి కోటి (18573) ఎక్స్‌ప్రెస్ వయా బినా మల్‌ఖెడి, బినా, సంత్ హిర్దరమ్ నగర్, నగడ, కోట జంక్షన్ల మీదుగా ప్రయాణిస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 7, 14 తేదీల్లో భగత్‌కి కోటి -విశాఖపట్నం(18574) వయా కోట జంక్షన్, నగడ, సంత్ హిర్దరమ్ నగర్, బినా, బినా మల్‌ఖెడి స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

ప్రత్యేక హోదాకై 'ఆప్' రిలే నిరాహారదీక్ష

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు నిర్వహించనుందని ఆ పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్ శీతల్ మదన్, జోనల్ కో ఆర్డినేటర్ శీర రమేష్‌కుమార్, విశాఖ జిల్లా కన్వీనర్ షేక్‌నాగూర్ పేర్కొన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహ పార్కు వేదికగా ఈ నెల 7,8,9 తేదీల్లో ఆప్ విశాఖ విభాగం ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. 9వ తేదీ దీక్షలో ఆప్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మణి నాయుడు, రాష్ట్ర కన్వీనర్ వీరప్రసాద్ పాల్గొంటున్నట్టు వారు తెలిపారు. ప్రత్యేక హోదా రాష్ట్రాభివృద్ధికి ఎంతో అవసరమైన అంశమని, ప్రత్యేక హోదాతో మన రాష్ట్రానికి పెట్టుబడులు, అభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విశాఖ నగర ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలకాలని కోరారు.

నగరంలో నేడు

- ఉదయం 9.30 గంటలకు చెంగళరావు పేటలోని క్రైస్ట్ చర్చ్ ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు
- ఉదయం 10 గంటలకు జగదాంబ అంబికాబాగ్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా కొత్త పెన్షన్ల పంపిణీ
- ఉదయం 10.30 గంటలకు మురళీనగర్ తెన్నేటి నగర్ లో క్షీరాబ్ధి యోగా సెంటర్ ప్రారంభం
- ఉదయం 10.30 గంటలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని స్కిల్‌హబ్‌లో శిక్షణ పొందిన వారికి పలు కంపెనీల్లో నియామకపత్రాలు అందజేత

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,580
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.50,950
వెండి(కిలో):	రూ.74,500

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.120
స్కిన్	: రూ.210
స్కిన్‌లెస్	: రూ.220

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	555.00
విజయనగరం	559.00
శ్రీకాకుళం	559.00

రైలు దిగుతుండగా.. కాలు జారి..

- పశ్చిమ గోదావరి వాసికి తీవ్ర గాయాలు
- కాళ్లపై నుంచి వెళ్లిన రైలు చక్రాలు
- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఘటన

అగనంపూడి(గాజువాక): దువ్వాడ రైల్వేస్టేషన్‌లో మరో ప్రమాదం జరిగింది. నెల రోజుల కిందట రైలు దిగుతూ ప్రమాదానికి గురై ఓ విద్యార్థి దుర్మరణం పాలవ్వగా.. మంగళవారం అలాంటి సంఘటనే నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై చోటు చేసుకుంది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

దువ్వాడ అవుట్‌పోస్ట్ జీఆర్పీ ఎస్‌ఐ శాంతారావు తెలిపిన వివరాలివీ.. పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన కర్రి సురేష్ ఇంటి వద్ద బంగారం పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సురేష్ అల్లుడు ప్రవీణ్ డాక్‌యార్డ్‌లో పని చేస్తూ శ్రీహరిపురంలో నివాసముంటున్నారు. తన కుమార్తె దీపిక గర్భిణి కావడంతో ఆమెను చూసేందుకు సురేష్ మంగళవారం తెల్లవారుజామున తణుకు నుంచి బయలుదేరారు. నిడదవోలులో ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కిన సురేష్ జనరల్ బోగీలో ప్రయాణం చేసి మధ్యాహ్నం 12.30 గంటలకు దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. కదులుతున్న రైలు దిగే ప్రయత్నంలో అతని కాలు జారి రైలు కింద పడిపోయారు. రైలు చక్రాలు అతని కాళ్ల మీద నుంచి కదలడంతో.. రెండు కాళ్లు నుజ్జయిపోయాయి. దీంతో రైలును ఆపారు. జీఆర్పీ ఎస్‌ఐ శాంతారావు, సిబ్బంది క్షతగాత్రుడిని బయటకు తీసి.. 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. కొంత సమయం తర్వాత రైలు బయలుదేరింది. కేసు దర్యాప్తులో ఉంది.



క్షతగాత్రుడు సురేష్‌ను తీసుకెళ్తున్న ఎస్‌ఐ, సిబ్బంది



క్షతగాత్రుడు సురేష్

ఇక్కడే ఎందుకు?

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో నాలుగో నంబర్‌ప్లాట్‌ఫాం అంచులకు ట్రాక్‌కు మధ్య 84 సెంటిమీటర్ల దూరం కంటే ఎక్కువగా ఉండడం వల్లే తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజా సంఘాలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నాయి. ఒకటి, నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై ఇదే పరిస్థితి ఉందన్నారు. 84 సెంటిమీటర్లకు మించి ఉండకూడదని నిబంధనలు చెబుతున్నాయని.. ప్లాట్‌ఫాం ఎత్తు కూడా పెంచకపోవడం మరో కారణమని ప్రయాణికులు అంటున్నారు.

విద్యలో ప్రగతికి 'మధ్యాహ్న భోజనం' కీలకం

- ఏయూ విద్యార్థి పరిశోధనలో వెల్లడి
- హాజరుశాతంలో మెరుగుదల



ఉత్తర్వులు స్వీకరిస్తున్న అనిల్ కుమార్

ఏయూక్యాంపస్ : విద్యార్థి విద్య ప్రగతికి మధ్యాహ్న భోజన పథకం ఉపయుక్తంగా నిలుస్తోంది. ఏయూ విద్యావిభాగం పరిశోధకులు కె.అనిల్ కుమార్ జరిపిన అధ్యయనంలో ఇది స్పష్టమైంది. విభాగ ఆచార్యులు ఆర్.రంగనాథన్, డాక్టర్ టి.షారోన్ రాజుల సంయుక్త పర్యవేక్షణలో 'ప్రాథమిక పాఠశాల విద్యార్థుల విద్య ప్రగతిలో మధ్యాహ్న భోజన పథకం ప్రభావం' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను అనీల్ కుమార్ స్వీకరించారు.

తన పరిశోధనలో భాగంగా అనిల్ కుమార్ విశాఖపట్నం జిల్లాలోని 450 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకుల నుంచి సమాచారాన్ని సేకరించారు. వీరిలో 90 మంది మంది ప్రధాన ఉపాధ్యాయులు, 180 అధ్యాపకులు, 180 తల్లిదండ్రులు నుంచి సమాచారాన్ని సేకరించి విశ్లేషించారు.

తన పరిశోధనలో భాగంగా గుర్తించిన అంశాలను పరిశీలిస్తే మధ్యాహ్న భోజన పథకం వలన పాఠశాలల్లో హాజరుశాతం గణనీయంగా పెరుగుదల, బడి మానేసే చిన్నారుల సంఖ్య తగ్గడం, నిత్యం తరగతిగదిలో హాజరు మెరుగ్గా ఉండటం, విద్యార్థుల్లో ఆసక్తి పెరిగినట్టు గుర్తించారు. పిల్లలు పూర్తి సమయంలో పాఠశాలలో ఉండటం, పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్యలో పెరుగుదలను గుర్తించారు.

పోషకాహారాన్ని పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో అందించడం వలన విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారు అవుతున్నారు. తద్వారా వారు విద్యలో మెరుగైన ప్రగతిని చూపుతున్నారు. భోజన నాణ్యత పెరుగుదల ఫలితంగా స్వచ్ఛందంగా పాఠశాలల్లో చేరుతున్నారని అధ్యాపకులు తెలియజేశారు. అత్యధిక శాతం మంది తల్లిదండ్రులు మధ్యాహ్న భోజన పథకం తమ పిల్లలకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. సెలవుల్లో సైతం వారికి అవసరమైన రేషన్ సరుకులు ఇవ్వడం ఏడాది పొడవునా చిన్నారులకు పోషకాహారం అందించడానికి ఉపయుక్తంగా నిలుస్తోంది.

అంతర్ కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



ఏయూ రెక్టార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయ రవీంద్ర

ఎంవీపీకాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం సమత కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఏయూ రెక్టార్ కె.సమత ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు యువత సమప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఈ పోటీల్లో పాల్గొనన్నారు. వారి వారి టీమ్స్ ద్వారా ఉత్తమ ప్రతిభ కనభరచాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఏయూ తరఫున ఇంటర్ సౌత్ జోన్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయరవీంద్ర, ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ పల్లవి, ఆచార్య రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

విశాఖ స్పోర్ట్స్ : నిరంతరం సమాజానికి సేవలందించే జర్నలిస్టులు ఒత్తిడిని దూరం చేసుకునేందుకు క్రీడలు నిర్వహించుకోవడం అభినందనీయమని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. పోర్ట్ స్టేడియంలో వీజేఎఫ్ సీఎంఆర్ విస్టా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్టులను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా సహకారం మరువరానిదన్నారు. ఈనెల 12వ తేదీ వరకు ఈ పోటీలు జరగనుండగా..తొలి రోజు అథ్లెటిక్స్‌లో జర్నలిస్టులకు ట్రాక్ ఫీల్డ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. జర్నలిస్టులతో కలిసి సరదాగా కమిషనర్ రాజాబాబు టగ్ ఆఫ్ వార్ ఆడారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, ఉపాధ్యక్షుడు నాగరాజు పట్నాయక్, కార్యదర్శి రవి కుమార్, విస్టా అధ్యక్షుడు ఉమాశంకర్, వీజేఎఫ్, విస్టా కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. తాడుగుంజె ఆటలో విజేతగా పట్నాయక్ స్టార్స్ నిలవగా.. రన్నరప్‌గా శ్రీనుబాబు జట్టు... సంయుక్త సెకండ్ రన్నరప్‌గా రవి, రామకృష్ణ జట్లు నిలిచాయి. మెన్ 100మీటర్ల పరుగులో కె.ఎస్ నాయుడు, శేఖర్, ముకేష్, 200మీటర్ల పరుగులో నాయుడు, సాయి, రామకృష్ణ, షాట్‌పుట్‌లో ముఖేష్, సాయి, శేఖర్, డిస్కస్‌త్రోలో ముఖేష్, శేఖర్, నర్సింగ్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఉమెన్ 50 మీటర్ల పరుగులో కృష్ణవేణి, సుధారాణి, కిరణ్మయి, షాట్‌పుట్‌లో వరలక్ష్మి, కృష్ణవేణి, శశి, డిస్కస్‌త్రోలో వరలక్ష్మి, సుధారాణి, కృష్ణవేణి, లాంగ్‌జంప్‌లో మహాలక్ష్మి, కిరణ్మయి, శశి తొలిమూడు స్థానాల్లో నిలిచారు.



జర్నలిస్టులతో కలిసి టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న కమిషనర్ రాజాబాబు

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

మంత్రిని కలిసిన ఉక్కు పరిరక్షణ కమిటీ

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని విక్రయించేందుకు కేంద్రం పావులు కదుపుతోందని.. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ అన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మిందిలోని ఆయన నివాసంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. 682 రోజులుగా ఉద్యమం చేస్తున్నట్లు చెప్పారు. ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ పలువురు రాజ్యసభ,లోక్‌సభ ఎంపీలు ఉభయ సభల్లో తమ గళాన్ని వినిపిస్తున్నా.. కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రావడం లేదన్నారు. ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో.. ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకునేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని కోరారు. దీనిపై మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో వై.టి.దాసు, వై.మస్తానప్ప, ఎన్.రామచంద్రరావు, రామకృష్ణ, వి.రామ్మోహనరావు, బి.పైడిరాజు, డి.నాయుడు, మంగా వెంకట్రావు, మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోరాట కమిటీ చైర్మన్లు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్



పెదజాలారిపేట సముద్ర కెరటాల్లో మత్స్యకార పిల్లలు ఫైబర్ బోట్లతో సయ్యాటలాడారు. ఎదురొచ్చే కెరటాలపైకి బోట్ల నుంచి ఎగురుతూ ఈతకొట్టారు. అలల చెంతన సందడి చేశారు.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్

7న మూన్ లైట్ ట్రెకింగ్

సింహాచలం: యూత్ హాస్టల్స్ అసోసియేన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 7వతేదీ మూన్‌లైట్ ట్రెకింగ్ నిర్వహిస్తున్నట్టు యూత్ హాస్టల్స్ అసోసియేషన్ విశాఖనగర యూనిట్ చైర్మన్ ఎస్ఆర్‌సీ మోహనరావు తెలిపారు. పౌర్ణమి చంద్రుడి కాంతుల్లో తెన్నేటి పార్కు నుంచి సాగర్‌నగర్ వరకు నడిచి వెళ్లి తిరిగి తెన్నేటిపార్కుకు చేరుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆ రోజు రాత్రి 7గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9391144968, 9703360044, 7386612125 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కారు ఢీకొని ఇద్దరు పోలీసులకు గాయాలు

మర్రిపాలెం (విశాఖ ఉత్తర): కారు ఢీకొనడంతో ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సూరి బాబు, కానిస్టేబుల్ సురేష్ సోమవారం నైట్ డ్యూటీ బీట్‌కు వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఊర్వశి థియేటర్ మీదుగా ద్విచక్రవాహనంపై కంచరపాలెం మెయిన్ రోడ్డు వైపు వస్తున్నారు. అటుగా వస్తున్న కారు వీరిని ఢీకొంది. ఈ ఘటనలో హెడ్ కానిస్టేబుల్ సూరిబాబుకు నడుం భాగంలో గాయం కాగా, సురేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నామని క్రైం సీఐ చెప్పారు.

సైబర్ నేరాలపై అవగాహన

అల్లిపురం (విశాఖ దక్షిణం): సైబర్ నేరాలపై సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ సైబర్ ఇంటిలిజెన్స్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్ డైరెక్టర్ ప్రసాద్ పాతిబండ్ల అవగాహన కల్పించారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో డీసీపీ-1 శాంతి భద్రతలు సునీల్ సుమిత్ గరుడ్, డీసీపీ-2, శాంతి భద్రతలు కె.ఆనంద్‌రెడ్డి, క్రైం డీసీపీ జి.నాగన్న, ఎస్‌బీ ఏడీసీపీ డి.గంగాధర్, ఏసీపీలు, సీఐలు, సైబర్ క్రైం సిబ్బంది అధికారులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

నిర్లక్ష్య ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



ఆర్పీపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థుల వర్క్ బుక్స్ చూస్తున్న డీఈవో చంద్రకళ

కంచరపాలెం : కంచరపాలెం పరిధి ఆర్పీపేట, కంచరపాలెం ప్రాథమిక పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో డీఈవో చంద్రకళ మండిపడ్డారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్ హాల్ పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, ఉపాధ్యాయులు టీచింగ్ ప్లాన్ బుక్స్ వినియోగించకపోవడం, పాఠశాలల పరిసరాలు, టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండడం, మహిళా ఉపాధ్యాయులు డ్రెస్ కోడ్ పై అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజన సమయంలో జగనన్న గోరు ముద్ద పథకం అమలు తీరును పరిశీలించారు. 1,2వ తరగతి విద్యార్థులకు జగనన్న గోరుముద్దను తినిపించారు. భోజనం రుచి ఎలా ఉందో విద్యార్థులు, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు డీఈవో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, పాఠశాలల పట్ల నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరించే ఉపాధ్యాయులకు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ కె. సువర్ణ, ఆర్పీపేట స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, సీఆర్‌పీ ఎల్.చైతన్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా అంతర జిల్లాల పోటీలు

చోడవరం రూరల్: అంతర జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు, రాష్ట్ర జట్ల ఎంపిక ప్రక్రియను మంగళవారం స్థానిక కళాశాల మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ, క్రీడా పతాకాలను జిల్లా వృత్తి విద్యా అధికారి ఆర్.సత్యనారాయణ ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి అండర్ 19 బాలుర, బాలికల జట్లు పోటీలకు హాజరయ్యాయి. జిల్లా వృత్తి విద్యా అధికారి సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.జె.కె.కృష్ణ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరచడం ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలను పొందే వీలుంటుందన్నారు. రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన వారు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.